క్లుప్తంగా

మహాదేవుడి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో మహాదేవుడి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వేదపండితులు అనురాగ్‌శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజనలో భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంగడీశ్వర ఆలయ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కడెం: మండలంలోని ఎలగడప పంచాయతీ పరిధిలో అంగడీశ్వర ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఇప్ప మల్లారెడ్డి, అధ్యక్షుడిగా ఏపూరు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎదులాపురం శేఖర్, కోశాధికారిగా రాపర్తి నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా నడిపి రాజన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎలగడప, మాసాయిపేట్, పెత్తర్పు, కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ గ్రామల నాయకులు పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ

సారంగపూర్: మండలంలోని అంతుల్వాయి తండాలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈమేరకు ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ గ్రామస్తులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు కిష్టు, మోహన్, రవి, రాజ్‌కుమార్, గౌస్, ముఖీమ్, రవూఫ్, మాషీ తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి'

నిర్మల్‌రూరల్: విద్యార్థుల రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్, ఇంటర్నెట్, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను నియమించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేంద్రచారి, చంద్రనాగకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి నెలకొంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి ట్యాబ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మటన్ షాపులకు క్యూ..



కుంటాలలో మటన్ కొంటున్న ప్రజలు

కుంటాల: తెలుగు రాష్ట్రాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుందనే కారణంతో మాంసం ప్రియులు చికెన్ కొనుగోలు చేసేందుకు అనాసక్తి కనబరుస్తున్నారు. ఆదివారం కుంటాల మండలంలోనూ చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. కల్లూరు, కుంటాల గ్రామాల్లో మటన్ దుకాణాల వద్ద మాత్రం వినియోగదారుల రద్దీ కనిపించింది.

ఐకేరెడ్డి జన్మదిన వేడుకలు



పండ్లు అందిస్తున్న ఐకేరెడ్డి అభిమానులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాకాల రాంచందర్, నాలం శ్రీనివాస్, మేడారం ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్, నిగులపు సంజీవ్, అనిల్, ఐకేరెడ్డి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడి మృతి



నాగేశ్ శాస్త్రి

ముధోల్: కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మండలకేంద్రానికి చెందిన నాగేశ్‌శాస్త్రి(75) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆదివారం ఉదయం ముధోల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇరుకురోడ్లతో ఇక్కట్లు..

- ప్రమాదాలకు నిలయంగా ప్రధాన దారులు
- ఏళ్లుగా సింగిల్‌రోడ్డే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇరుకు రోడ్డుతో జీర్ణంది మార్గంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులు (ఫైల్)



రాజూరా-సింగాపూర్ మార్గంలో వెళ్తున్న టిప్పర్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో సుమారు 20 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్ల వెంట రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఖానాపూర్ టూ ఎర్వచింతల్, ఖానాపూర్ టూ రాజూరా, ఖానాపూర్ టూ పెంబి మార్గం, ఖానాపూర్ టూ బావాపూర్(కే) మార్గంలోని పల్లె రోడ్లు పీఆర్, ఆర్ అండ్‌డీ రోడ్లుగా కొనసాగుతున్నాయి.

దట్టమైన అటవీ ప్రాంతంలో జంతువులు వచ్చి వెళ్లే ఈ రోడ్లపై వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తారు. ఒక వాహనం ఎదురుగా వచ్చిందంటే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో తరచుగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మారని సింగిల్‌రోడ్ల దుస్థితి...

కొన్ని దశాబ్దాల కిందట పదుల సంఖ్యలో వచ్చి పోయే వాహనాలను దృష్టిలో ఉంచుకొని సింగిల్‌రోడ్లు ఏర్పాటు చేశారు. తర్వాత వాహనాల సంఖ్య పెరిగినా సింగిల్ రోడ్ల విస్తరణ చేపట్టలేదు. దీంతో ఒక వైపు నుంచి బస్సు, లారీ వంటి వాహనాలు వస్తే మరోవైపు నుంచి వచ్చే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలలుగా అధికారులు మొరం తరలించేందుకు పలు మార్గాల్లో అనుమతులు ఇవ్వడంతో సింగిల్ రోడ్డుపై కాంట్రాక్టర్లు టిప్పర్లలో మొరం తరలిస్తున్నారు.

ఇసుక, మొరం అక్రమదందా చేసే భారీ వాహనాలు సింగిల్‌రోడ్డుపై వెళ్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన రోడ్లు గుంతలుగా మారుతున్నాయి.

ప్రమాదాలకు పిలుపుగా..

ఆయా మార్గాల్లో పలుచోట్ల ప్రమాదకర మలుపులతోపాటు కల్వర్టులు, ఇరువైపులా అటవీ ప్రాంతం, వ్యవసాయ పొలాలు ఉండడంతో రోడ్లు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. రోడ్డు చిన్నగా ఉండటం, వాహనాల సంఖ్య పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి అటవీ ప్రాంతం గుండా రోడ్డుపై వచ్చే వాహనదారులపై పలు జంతువులు దాడి చేస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వీడీసీలు పేర్కొంటున్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో మండల కేంద్రాలకు వెళ్లే ప్రధాన రహదారులను డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వ ప్రకటన అమలు కాకపోవడంతో ప్రజలు నిరాశతో ఉన్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఆయా మార్గాల్లోని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించి.. మలుపులున్న చోట హెచ్చరిక బోర్డులు, తదితర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భైంసాలో వంతెనల పక్కన వ్యర్థాలు

- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు



ఆటోనగర్ బైపాస్‌మార్గంలో వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త

భైంసాటౌన్: పట్టణంలోని పలుచోట్ల కొందరు బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తున్నారు. ఆటోనగర్ వెళ్లే బైపాస్ మార్గంలో వంతెన వద్ద, సాత్‌పూల్ వంతెన వద్ద ఇష్టారీతిన చెత్త, ఇతర వ్యర్థాలు, జంతువుల కళేబరాలు పారవేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లే వాహనదారులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్ వెళ్లే బైపాస్ వంతెనకు ఇరువైపులా కొందరు వ్యర్థాలు పోగు చేస్తూ క్రమేపీ ఆక్రమించుకుంటున్నారు.

దీంతో వర్షాకాలంలో వాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక సాత్‌పూల్ వంతెనకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలు పారవేస్తుండడంతో అధ్వానంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రమాబాయి జయంతి ఉత్సవం



పూలమాల వేస్తున్న బౌద్ధ భిక్షువు రాజరతన్

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో ఆదివారం రాత్రి రమాబాయి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భైంసా బుద్ధవిహార్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బౌద్ధ భిక్షువు బంతే రాజరతన్ సేనాపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రమాబాయి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఆయన ప్రవచనాలు చెప్పారు. ఈసందర్భంగా పుణేకు చెందిన రమణి బబిత, ఆకాశ్, ముధోల్‌కు చెందిన గడపాలే అంజలి బింబిసార్ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు. డివిజన్ పరిధిలోని దళిత మహిళలు, యువకులు తరలివచ్చారు. అంబేద్కర్ యువజన సంఘాలు, మాల మహానాడు, బుద్ధవిహార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల పర్యటన



గోధుమ పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

తానూరు: జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆచార్య జయంకర్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆదివారం మండలంలోని బోంద్రట్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు సిందే సాయినాథ్ 20 ఎకరాల్లో సాగు చేస్తున్న సేంద్రియ పంటలను పరిశీలించారు. సేంద్రియ సాగులో పాటించాల్సిన పద్ధతులు, ఎరువులు, ద్రావణాల తయారీ, వినియోగంపై రైతు అవగాహన కల్పించారు. దేశీయ వంగడాలు, హైబ్రీడ్ రకం వంగడాలు, విత్తనశుద్ధి తదితర అంశాల గురించి పలువురు విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు.

అంతా అంధకారమే..



వెలగని లైట్లు



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై పగలు



కలెక్టరేట్ రోడ్డులో..

జిల్లాకేంద్రంలో రెడ్డిగార్డెన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పనిచేయడం లేదు. దీంతో ఈ మార్గమంతా రాత్రి అంధకారం నెలకొంటుంది. 2023 జూన్ 3న అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించిన లైటింగ్ ఇప్పటికీ వెలుగులు పంచడం లేదు. కలెక్టర్, జిల్లా అధికారులు, ఎల్లపల్లి, డబుల్ బెడ్‌రూం కాలనీ, నాగ్నాయిపేట్, మహాలక్ష్మి కాలనీ, బంగల్‌పేట్ గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి లైటింగ్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్ దేవరలొద్ది సమీపంలోని ప్రభులింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారంరెండోరోజుకు చేరాయి. ఈసందర్భంగా వేదపండితులు శ్రావణ్‌కుమార్ జోషి, ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

చించోలి(బి)లో..

సారంగపూర్: మండలంలోని చించోలి(బి)లో ఆదివారం నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.11వేలను విరాళంగా అందజేశారు. నవీన్‌రెడ్డి, అహ్మద్‌ముక్తార్, సురేందర్, నర్సయ్య, మధుకర్, పోతిండ్ల శంకర్ తదితరులు ఉన్నారు.

'అంజిరెడ్డిని గెలిపించండి'

కుంటాల: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అంజిరెడ్డిని గెలిపించాలని పలువురు పట్టభద్రులు కోరారు. ఆదివారం మండలంలోని కల్లూరు గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పసుల నవీన్, గడ్డం నవీన్ రెడ్డి, దిగంబర్ పటేల్, దట్టు పటేల్, ముస్కు అనిల్, శివాజీ పటేల్ తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే జగదాంబ దేవి సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాలని బంజారా సంఘం నాయకులు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌ను కోరారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఖానాపూర్‌లోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో జాన్సన్‌నాయక్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అంతకుముందు ఈనెల 17న కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు వృక్షార్చన, సామాజిక సేవా కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

పేదింటి బిడ్డ వివాహానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కడెం: పేదింటి వివాహానికి పలువురు దాతలు సాయం అందించారు. కడెం మండలంలోని అంబారిపేట్‌లో పేద కుటుంబమైన కల్వకుంట్ల రాము-లక్ష్మి దంపతుల కూతురు లావణ్య వివాహం ఆదివారం జరగగా.. అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు మెరుగు సురేఖ-ఇంద్రసేనారెడ్డి, శెట్‌పల్లి మహేందర్, మెరుగు ప్రదీప్‌రెడ్డి, పెద్దూరి గణేశ్ రూ.20వేలను సమకూర్చారు. సదరు నగదును ఇంద్రసేనా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పెళ్లి కూతురుకు ఈ మొత్తాన్ని అందజేశారు.

మల్లన్న హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ మల్లన్న ఆలయ హుండీ ఆదాయం ఆదివారం లెక్కించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 15వరకు వైభవంగా నిర్వహించిన మల్లన్న జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించిన హుండీలో రూ.5లక్షల 3వేల920 సమకూరినట్లు పేర్కొన్నారు. 42తులాల వెండి, 8 గ్రాముల బంగారం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నిమ్మ పోతన్న, నల్ల విఠల్ రెడ్డి, బి.ముత్యంరెడ్డి, రావుల గంగారెడ్డి, దత్తాత్రి, భూమన్న, ప్రవీణ్‌రెడ్డి, కండెల సాయినాథ్, సుధాకర్‌యాదవ్, విఠల్‌యాదవ్, పూజారులు గుల్ల ఆశన్న, గంగన్నయాదవ్, ముధోల్ తాలూకా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామ సమీపంలో ఆదివారం గోదావరి ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన బి.మల్లేశ్, వై.సతీశ్‌రావ్ ట్రాక్టర్లలో గోదావరి ప్రాంతం నుంచి ఇసుకను యంత్రాల ద్వారా సన్నరకంగా మార్చి సమీప గ్రామాల్లో విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరం టిప్పర్..

ఖానాపూర్: అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం పట్టుకున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. తర్లపాడ్ మీదుగా అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారంతో టిప్పర్‌ను పట్టుకొని మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మొరం, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ స్మారకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ఖానాపూర్ జట్టుకు ప్రథమ బహుమతిగా షీల్డ్, రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా మస్కాపూర్ జట్టుకు షీల్డ్, రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, తిరుమలగిరి, స్వామి, రాజన్న, సురేశ్, శివ, మహేశ్, అశోక్, పోతరాజ్, సాగర్, నాగరాజు, వంశీ, నరేశ్, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్ : మస్కాపూర్‌లో తులాభారంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లచ్చన్న, రాజు, శ్రీనివాస్, శంకర్, మల్లేశ్, రాజేందర్, రాకేశ్, తదితరులున్నారు.

బొజ్జు గెలిచినందుకు మొక్కు చెల్లింపు..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ రాజరాజేశ్వర ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా బొజ్జు గెలిచినందుకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొనికేని దయానంద్ తులాభారం మొక్కును చెల్లించారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, అంకం రాజేందర్, నిమ్మల రమేశ్, బొశెట్టి నర్సయ్య, దొనికెని సాగర్, తోట సత్యం, రాచర్ల లక్ష్మణ్, వంశీ, శంకర్, రాజునాయక్, రాజన్న ఉన్నారు.

'చలో హైదరాబాద్‌కు తరలిరావాలి'



లోకేశ్వరం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజు, సీపీఐ(ఎంఎల్) నాయకులు

లోకేశ్వరం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్ర మానికి ప్రజలు తరలిరావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. ఆదివారం మండలంలోని పుస్పూర్ గ్రామంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ముత్తన్న, ప్రసాద్, పోతన్న, రాజన్న ఉన్నారు.

మామడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. ఆదివారం మామడలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లింగన్న, ప్రసాద్, స్వామి, శేఖర్, గంగన్న, మహేశ్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

మురుగునీటితో అవస్థలు



కుంటాల: మండలంలోని ఓలా నుంచి లింబా(బి) వెళ్లే మార్గంలో ఓలా తండా వద్ద మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి రాకపోకలు సాగించే ప్రయాణికులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : యోగేశ్, ఓలా కార్యదర్శి, ఫోన్: 7702174133